సిఫారసు లేఖలకు గిరాకీ!

- బదిలీ ఏరియాను బట్టి లేఖ వెల రూ.5వేల నుంచి రూ.10 వేలు
- ఎమ్మెల్యే కార్యాలయానికి క్యూ కడుతున్న సచివాలయ ఉద్యోగులు



సాక్షినెట్ వర్క్: పెడనలో సచివాలయ బదిలీల సిఫారసు లేఖలకు గిరాకీ పెరిగింది. తండ్రి ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో ఎలాగూ బాగుపడలేదు.. ఇప్పుడు తనయుడు హయాంలో అయినా బాగుపడాలనే ఉద్దేశంతో సదరు ఎమ్మెల్యే పీఏ అందినకాడికి దోచుకోవడం ప్రారంభించారు. అధికారంలో ఉన్నాం అనే ధీమా..లేక రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది మనల్నేం చేస్తారనే ధీమాతో ప్రభుత్వ అధికారులను, ఉద్యోగులను బెదిరిస్తూ తన పబ్బం గడిపేస్తున్నారు. మట్టి మాఫియా, అనధికార చెరువుల తవ్వకాలు, ప్రభుత్వ భూములు కబ్జా ఇలా అన్నిటిలోనూ తలదూర్చుతుండటంతో కొందరు సీనియర్లు ఎమ్మెల్యేకు చెడ్డ పేరు తీసుకువస్తున్నారంటూ పలువురు వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

సిఫారసు లేఖలకు డిమాండ్.

రాష్ట్ర ప్రభుత్వం వార్డు, గ్రామ సచివాలయాల్లో ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు బదిలీ తప్పనిసరి అని పేర్కొనడమే కాకుండా సొంత మండలంలో పోస్టింగ్ లేదని, తర్వాత ఉందని స్పష్టం చేసింది. దీంతో కనీసం తమ సొంత మండలం, పక్క మండలంలో అయినా పోస్టింగ్ తెచ్చుకుందామనే ఆలోచనలతో ఎమ్మెల్యే సిఫార్సు లేఖలు తెచ్చుకునేందుకు సిద్ధమయ్యారు. దీనిని సదరు ఎమ్మెల్యే పీఏ 'మూర్తీ'భవించిన ఆలోచనలతో సిఫార్సు లేఖలకు ధరలు నిర్ణయించి వసూళ్లు చేయడం ప్రారంభించారు. బాగా డిమాండ్ ఉన్న చోటుకు సిఫార్సు లేఖకు రూ.10 వేలు, డిమాండ్ లేకపోతే రూ.5 వేలు సమర్పించుకోవాల్సిందే. ఇలా ఎమ్మెల్యే పరిధిలో సుమారు 200 లెటర్ల వరకు జారీ చేసినట్లుగా తెలుస్తోంది.

ఎమ్మెల్యే ఇంటి వద్దే ...ఈ తంతు...

సదరు ఎమ్మెల్యే ఇంటి వద్దే వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులకు నగదు తీసుకుని లెటర్లు ఇచ్చేస్తుండటంతో ఆ ఎమ్మెల్యే నాలుగు రోజులుగా ఇంటి వద్ద లేకపోయినా సందడి సందడిగా ఉంటోందని చెబుతున్నారు. సాయంత్రం సమయంలో సదరు ఉద్యోగులు లెటర్ల కోసం అర్ధరాత్రుల వరకు కూడా వేచి ఉండటం గమనార్హం. అయితే ఈ స్థాయిలో సిఫార్సు లెటర్లు జారీ చేసిన ఎమ్మెల్యేల జాబితాలో జిల్లా కేంద్రానికి సమీపంలోని ఈ ఎమ్మెల్యేకే ప్రత్యేక గుర్తింపు దక్కవచ్చనే ఊహాగానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇంత పెద్ద మొత్తంలో వచ్చిన సిఫార్సు లేఖలను పరిగణనలోకి తీసుకుంటారా లేక చెత్తబుట్టలో వేస్తారా అనే సందేహాలను కూడా సచివాలయ ఉద్యోగులే పేర్కొనడం గమనార్హం. మరో పక్క సీఎం చంద్రబాబు సైతం సిఫారసు లేఖలను పరిగణనలోకి తీసుకోవద్దన్నారని సోషల్ మీడియాలో వార్త చక్కర్లు కొడుతోంది. ఇప్పటికే డబ్బులు చెల్లించి లెటర్లు తీసుకున్న ఉద్యోగులు తమ పరిస్థితి ఏమిటా అని తలలు పట్టుకుంటున్నారు. ఇచ్చిన డబ్బులు వెనక్కు రావు...తిరిగి అడగ లేని పరిస్థితి. ఏది ఏమైనా ఎమ్మెల్యే పీఏ అంటే ఆ నియోజకవర్గంలో అంత వ్యాల్యూ అనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

క్లుప్తంగా

పేర్ని నానిని విమర్శించే స్థాయి రామకృష్ణకు లేదు

చిలకలపూడి(మచిలీపట్నం): మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య (నాని)ని విమర్శించే స్థాయి బండి రామకృష్ణకు లేదని వైఎస్సార్ సీపీ జిల్లా జాయింట్ సెక్రటరీ గణేశన రమేష్‌బాబు అన్నారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మీ నాయకుడు పవన్‌కళ్యాణ్ ఏదైనా డైలాగ్ చెబితే మీకు బాగుంటుందని, అదే ప్రతిపక్ష నాయకుడు చెబితే తాట తీస్తాం, తోలు తీస్తామని వ్యాఖ్యానించటం సబబా అన్నారు. బందరులో అభివృద్ధి జరిగిందంటే అది ఒక్క పేర్ని నానికే సాధ్యమైందన్నారు. నార్త్ మండల పార్టీ అధ్యక్షుడు మట్టా మోహన నాంచారయ్య మాట్లాడుతూ గంటకోమాట మాట్లాడే పవన్‌కళ్యాణ్ పార్టీలో ఉన్న మీరు కొత్తగా రాజకీయాల్లోకి వచ్చి ఇలా మాట్లాడటం హాస్యస్పదంగా ఉందన్నారు. ఎంపీటీసీ మాజీ సభ్యులు పిప్పళ్ల నాగబాబు, నాయకులు వన్నెంరెడ్డి రామకృష్ణ, చిలంకుర్తి కొండ, మేడిశెట్టి రాజా, డి.బాలకృష్ణ, అర్జా శంకర్, గాజుల నాగరాజు, పవన్ పాల్గొన్నారు.

డీఎస్సీకి 25 మంది గైర్హాజరు

పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో డీఎస్సీ పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాజారమేష్, అడ్మిన్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన ఈ పరీక్షకు 180 మందికి గాను 155 మంది హాజరయ్యారని,25 మంది ఆబ్సెంట్ అయ్యారు. మధ్యాహ్నం నుంచి పరీక్ష లేదన్నారు. పరీక్ష ప్రశాంతంగా జరిగిందన్నారు.

సామూహిక కుంకుమార్చన



కె.కొత్తపాలెం(మోపిదేవి): మండలంలోని కె.కొత్తపాలెం కృష్ణానది ఒడ్డున కొలువైన శ్రీ దుర్గా కోటేశ్వరస్వామివారి ఆలయంలో వారాహి గుప్త నవరాత్రి మహోత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ వ్యవస్థాపకులు రామిశెట్టి నాగరాణి, రామకృష్ణ దంపతులచే స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. అనంతరం సాయంత్రం భక్తిశ్రద్ధలతో దుర్గమ్మ అమ్మవారికి మహిళలచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

చట్టాలపై అవగాహన అవసరం

కోనేరుసెంటర్: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆర్‌పేట సీఐ కె.ఏసుబాబు తెలిపారు. నగరంలోని ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ సమాజాంలో జరుగుతున్న అన్యాయాన్ని ఎదురించాలంటే అది ఒక్క యువత వలనే సాధ్యపడుతుందన్నారు. అలాంటి యువత చట్టాలపై అవగాహన కలిగి ఉండటం వలన ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రభుత్వం మహిళలు, చిన్నారులు, యువతుల భద్రత కోసం అనేక యాప్‌లను అందుబాటులోకి తెచ్చిందన్నారు. యువత చెడు మార్గాల జోలికి పోకుండా సన్మార్గంలో నడుస్తూ అందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. మంచి అలవాట్లతో విద్యార్థి జీవితాన్ని ఆస్వాదిస్తూ చదువులో రాణించాలన్నారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పి సందేహాలను నివృత్తి చేశారు. ఎస్సై మాణిక్యమ్మ, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యులకు శిక్షణ

మచిలీపట్నంఅర్బన్: స్థానిక సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం (ఆర్బీఎస్కే) జిల్లా అధికారి డాక్టర్ హిమబిందు ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రాథమిక వైద్యశాలల వైద్యులకు శుక్రవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నవజాత శిశువుల నుంచి 18 సంవత్సరాల లోపు వయసు గల బాలబాలికలలో పుట్టుకతో వచ్చే వ్యాధులు, శారీరక, మానసిక ఎదుగుదల లోపాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ చాందిని మాట్లాడుతూ పిల్లలలో పుట్టుకతో వచ్చే లోపాలను ప్రారంభంలోనే గుర్తిస్తే తగిన వైద్య చికిత్సను అందించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దవచ్చన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హారిక, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దీప్తి, డాక్టర్ శ్రీజ, వైద్యులు, ఆర్బీఎస్కే సిబ్బంది పాల్గొన్నారు.

బాలికను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

బంటుమిల్లి: గత కొన్ని రోజులుగా కనిపించకుండా పోయిన బాలికను పోలీసులు శుక్రవారం గుర్తించారు. ఎస్ఐ గణేష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని జయపురం గ్రామానికి చెందిన బాలిక (12) కనిపించకుండా పోవడంతో తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 23న కేసు నమోదు చేశామన్నారు. జయపురం గ్రామం నుంచి ఆటోలో వెళ్లిన బాలిక బంటుమిల్లి బస్టాండులో దిగి ఆర్టీసీ బస్సు ఎక్కి మచిలీపట్నం వెళ్లింది. ఆధార్ కార్డులో ఉన్న బాలిక ఫొటోను వాట్సప్ గ్రూపుల్లో పెట్టగా గుర్తించిన వ్యక్తులు మచిలీపట్నంలో ఉన్నట్లు పోలీసులకు సమాచారం తెలియజేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో బాలిక కోసం వెతుకుతున్న ప్రత్యేక బృందాలు మచిలీపట్నంలో బాలికను గుర్తించి, బంటుమిల్లి తీసుకువచ్చి సమగ్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్)అధికారుల సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించామని తెలిపారు.

జిల్లా కలెక్టర్ బాలాజీకి యోగా గురువుల సన్మానం


జిల్లా కలెక్టర్ బాలాజీని సన్మానిస్తున్న యోగా గురువులు, సాధకులు

మచిలీపట్నంటౌన్: జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రశంసలందుకున్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ జిల్లాకే గర్వకారణమని యోగా గురువులు ఘంటసాల గురునాథ్ బాబు, మద్దాల చింతయ్య పేర్కొన్నారు. స్థానిక గాంధీనగర్ ఉదయపు నడక మిత్రమండలి భవనంలో యోగా గురువులు గురునాథ బాబు, చింతయ్య నిర్వహించిన యోగా శిక్షణ తరగతుల్లో కలెక్టర్ బాలాజీ పాల్గొని యోగాసనాలు వేశారు. అనంతరం యోగ గురువులు ఏపీ యోగాసభ సభ్యులు, అభ్యాసకులు, చిన్నారులు అందరూ కలిసి జిల్లా కలెక్టర్‌కు మొక్కలు, పుష్ప గుచ్ఛాలు, పూలు, పండ్లు అందజేసి శాలువలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగ సభ సభ్యులు వడ్డి శ్రీనివాసు, ట్రస్టీ యారా జగన్మోహనరావు, సమాచార శాఖ ఉపసంచాలకులు వెంకటేశ్వర ప్రసాద్, జెడ్పీ ఏవో మానేపల్లి శ్రీనివాస్, సబ్ రిజిస్ట్రార్ పి.రాము, అశోక్ మాస్టారు, ఆర్‌డి.ప్రసాద్, కమ్మిలి లక్ష్మి, సునంద, రేఖ, రంజిత, రాజకుమారి పలువురు అభ్యాసకులు పాల్గొన్నారు.

చదువుతోనే తగిన గుర్తింపు


వేముల హేమంత్‌ను సన్మానిస్తున్న చల్లపల్లి గ్రామస్తులు

చల్లపల్లి: చదువు ద్వారానే తగిన గుర్తింపు లభిస్తుందని మారుమూల గ్రామమైన చల్లపల్లికి చెందిన వేముల హేమంత్ చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవటం అభినందనీయమని ఉపసర్పంచ్ ముమ్మనేని రాజకుమార్ (నాని) అన్నారు. కాస్ట్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్(సీఎంఏ) పరీక్షలో జాతీయ స్థాయిలో 36వ ర్యాంకు సాధించిన చల్లపల్లికి చెందిన వేముల హేమంత్‌ను శుక్రవారం పలువురు ప్రముఖులు సన్మానించారు. స్థానిక షాబుల్‌బజార్‌లో నివాస గృహానికి వెళ్లి పూలమాలలు, శాలువాలతో హేమంత్‌ను ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుతూ అభినందించారు. కార్యక్రమంలో మోర్ల రాంబాబు, జన్ను నాంచారయ్య, వేముల హరికృష్ణ, హేమంత్ తండ్రి పాండురంగారావు తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

■ నేడు సీపీఐ 25వ జిల్లా మహాసభ

చినకళ్లేపల్లి(ఘంటసాల): మండలంలోని చినకళ్లేపల్లి గ్రామంలో శనివారం సీపీఐ 25వ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని చినకళ్లేపల్లిలో మహాసభ ఏర్పాట్లను శుక్రవారం పార్టీ నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఈ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హాజరవుతారని, రాబోయే మూడేళ్లలో పార్టీ దిశా నిర్దేశం, పేదల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్, జిల్లా కార్యదర్శి కామ్రేడ్ నార్ల వెంకటేశ్వరరావు, ప్రజానాట్యమండలి నాయకులు ఆర్.పిచ్చియ్య, ఇన్సాఫ్ స్టేట్ సెక్రటరీ అప్సర, నియోజకవర్గ సహాయ కార్యదర్శులు హనుమానుల సురేంద్రనాథ్‌బెనర్జీ, గుత్తికొండ రామారావు, కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, సిద్దా బత్తుల హేమర్దన, డి.గోపాలకృష్ణ, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

■ సీసీ రోడ్డు పనుల పరిశీలన

పెడన: పట్టణంలోని 8వ వార్డులో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.10.60 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. ఊటుకూరు సావిత్రి ఇంటి వద్ద నుంచి సెలా బ్రహ్మం ఇంటి వరకు నిర్మిస్తున్న ఈ సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. మున్సిపల్ ఏఈ కాగిత సీతారామాంజనేయులు, సచివాలయ ఎమినిటి సెక్రటరీ వేముల వెంకటేష్, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

■ పంటకాలువపై తూము కల్వర్టు ఏర్పాటు

కోడూరు: మండలంలోని వి.కొత్తపాలెం గ్రామంలో ఉన్న నాల్గవ నంబర్ పంటకాలువపై అధికారులు తూములతో కల్వర్టును ఏర్పాటు చేశారు. గతంలో ఈ కాలువపై ఉన్న శ్లాబ్ కల్వర్టు ఇటీవల కుప్పకూలిపోయింది. దీంతో కాలువ దిగువ రైతులు రాకపోకలు సాగించేందుకు అవకాశం లేకపోవడంతో పాటు పంట సాగు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కల్వర్టు కూలిపోవడంతో వంద ఎకరాల సాగుభూమికి విత్తనాలు, ఎరువులు కూడా వెళ్లే పరిస్థితి లేదు. దీంతో స్పందించిన అధికారులు శ్లాబ్ కల్వర్టు కూలిన స్థానంలో తూములను ఏర్పాటు చేశారు. సాగునీరు పారేందుకు వీలుగా తూములు ఏర్పాటు చేసి, పైభాగంలో రాకపోకలు సాగించేందుకు మార్గం ఏర్పాటు చేశారు.

■ విద్యార్థులకు కిట్ల పంపిణీ

గూడూరు: చిట్టిగూడూరు పాఠశాలలో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. సర్పంచి లంకా చంద్రలీల విద్యార్థులకు కిట్లను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.నవీన్ బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ పెద్దలు రాసంశెట్టి శివరావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

■ ఎక్స్‌రే యూనిట్ ప్రారంభం

గూడూరు: ప్రభుత్వాసుపత్రులలో ఆధునిక వైద్య సేవలు పేదలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎక్స్‌రే యూనిట్, సీఆర్ యూనిట్లను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆధునిక ఎక్స్‌రే, సీఆర్ యూనిట్ వల్ల రోగులు ఇబ్బందులు పడుతూ బందరు వెళ్లాల్సిన పరిస్థితి ఇక నుంచి ఉండదన్నారు. ఆసుపత్రికి సమకూరిన పరికరాలు కేవలం ఎక్స్‌రే తీయడం వరకే కాకుండా టెలీ రిపోర్టింగ్ సౌకర్యం కూడా ఉందన్నారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్ పోతన స్వామి, డీసీహెచ్ఎస్ వి.శేషకుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్ వి.నరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

కాల్వకు నీటి విడుదల..

రామరాజుపాలెం కాల్వకు నీటి విడుదల కార్యక్రామాన్ని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. నిడుమోలులాకుల దగ్గర జరిగిన కార్యక్రమంలో పండితుల వేదమంత్రాల మధ్య లాకులు ఎత్తి కాల్వకు నీరు విడుదల చేశారు. కార్యక్రమంలో రైతులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

■ టీటీసీలో విద్యార్థినుల ప్రతిభ


బస్వాని యమున


నడకుదిటి నాగజ్యోతి

కృత్తివెన్ను: మండల పరిధిలోని పోడు హైస్కూల్ ప్లస్ కాలేజీలో ఇంటర్ పూర్తిచేసిన ఇద్దరు విద్యార్థులు టీటీసీలో ర్యాంకులు సాధించారు. ఇదే కాలేజీలో ఎంపీసీ పూర్తిచేసిన బస్వాని యమున 183వ ర్యాంకు, నడకుదిటి నాగజ్యోతి 264 టీటీసీ ర్యాంకులు సాధించినట్లు ఉపాధ్యాయులు వీరాస్వామి తెలిపారు. ప్రస్తుతం బైపీసీ మొదటి సంవత్సరంలో 11 మంది, ఎంపీసీ ద్వితీయ సంవత్సం 7 గురు బాలికలు చదువుతున్నట్లు హెచ్‌ఎం వీరాంజనేయులు తెలిపారు. 2020- 21 విద్యాసంవత్సరానికి గాను బాలికల కోసం పోడు ఉన్నత పాఠశాలలో హైస్కూల్ ప్లస్ విద్యను ప్రారంభించారు. ఇప్పుడు ఇదే పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు టీటీసీకి ఎంపీక కావడం పట్ల ఉపాధ్యాయులతో పాటు వారి తల్లితండ్రులు, స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కళాకారులను ఆదుకోవాలి

కోడూరు: రంగస్థల కళాకారులను ప్రభుత్వం గుర్తించి, ఆదుకోవాలని హరికథ కళాకారుడు లంకె వెంకటస్వామి కోరారు. ఈ మేరకు రంగస్థల కళాకారులకు పెన్షను అందించాలని డెప్యూటీ తహసీల్దార్ సౌజన్య కిరణ్మయికి శుక్రవారం వినతిపత్రం అందించారు. కళాకారుల జీవనోపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నాటకాలు, కథలు చెప్పే కళాకారులు ఆ వృత్తిని వదులుకొని కూలీలుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రంగస్థల కళాకారులను గుర్తించి నెలకు రూ.6 వేలు పెన్షనుఅందించాలన్నారు.

30న జాబ్‌మేళా

మచిలీపట్నంటౌన్: జిల్లా నైపుణ్యాల అభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రముఖ పరిశ్రమలలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 30న ఉదయం 9:30 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బైపాస్ రోడ్‌లోని కృష్ణవేణి ఐటీఐ కళాశాల ఆవరణలో 'కంపెనీ స్పెసిఫిక్ డ్రైవ్' పేరుతో ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామన్నారు. ఈ 'కంపెనీ స్పెసిఫిక్ డ్రైవ్'లో ప్రముఖ 'ఎమ్ఆర్ఎఫ్ లిమిటెడ్' కంపెనీ వారు పాల్గొంటున్నారన్నారు. ఈ కంపెనీలో ఉన్న ఉద్యోగాలకు పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన 18 నుంచి 28 సంవత్సరాలలోపు యువకులు మాత్రమే అర్హులన్నారు. ఉద్యోగాలకు ఎంపిక అయిన వారికి రూ.17,500 నుంచి రూ.20,500 వరకు వేతనముతో పాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తారన్నారు. వివరాలకు 99664 89796 సెల్ నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఉపాధ్యాయినికి సన్మానం

చిట్టూర్పు(ఘంటసాల): మండలంలోని చిట్టూర్పు మండల పరిషత్ పాఠశాల (ఆర్)లో కొడాలి లక్ష్మీ భవాని ఉపాధ్యాయినిగా పనిచేస్తూ బదిలీపై కొడాలి గ్రామం మోడల్ పాఠశాలకు వెళ్తున్న సందర్భంగా శుక్రవారం ఆత్మీయ సత్కారం నిర్వహించారు. చిట్టూర్పులోని పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జి.రాజ్యలక్ష్మి, వరప్రసాద్ దంపతులు, వైఎస్సార్ సీపీ నేత దాసరి కుటుంబరావు, పాలకేంద్రం ప్రెసిడెంట్ దాసరి శివ వెంకట సుబ్బయ్య, హెచ్‌ఎం బండారు వెంకటేశ్వరమ్మలు లక్ష్మీ భవానీని సత్కరించి మెమెంటో అందించారు. విద్యా కమిటీ చైర్మన్ కె.నీతు ప్రవల్లిక, చిట్టూరి ఆదిశేషు, ఓలేటి కేశవరావు, విద్యార్థులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

100 మందికి వైద్య పరీక్షలు

బంటుమిల్లి: స్థానిక కాంతి కేంద్రం యోగా ట్రస్ట్ భవనంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరంలో సుమారు 100 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో గుడివాడ ప్రభుత్వ గురురాజు హోమియో వైద్యశాల వైద్యులు హేమలత పాల్గొని వైద్య పరీక్షలు చేసి మందులు సిఫారసు చేశారు. జూనియర్ డాక్టర్లు రేఖ, హేమ, మౌనికలు రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. ల్యాబ్ టెక్నీషియన్ గోపి షుగర్ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా రక్త పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రం నిర్వాహకులు జే వాసుదేవరావు, ఏ. రమణ, అమలేశ్వరరావు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని రోగులు పాల్గొన్నారు.

వాటర్ స్టోరేజీ ట్యాంకు ప్రారంభం

నాగాయలంక: ఈనెల ఆఖరున ఉద్యోగ విరమణ చేయనున్న స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ వ్యాయామ ఉపాధ్యాయుడు కోసూరు పూర్ణచంద్రరావు రూ.70 వేల వితరణతో విద్యార్థుల కోసం హ్యాండ్ వాష్ వాటర్ స్టోరేజి ట్యాంకు నిర్మించి ఇచ్చారు. విద్యార్థుల డైనింగ్ హాలు ప్రాంగణంలో దాత తల్లిదండ్రులు కోసూరు పరుశురామయ్య- కృష్ణవేణి జ్ఞాపకార్థం నిర్మించిన ఈ ట్యాంకును అవనిగడ్డ సీఐ పి.యువకుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఎస్.ఐ కలిదిండి రాజేష్, హెచ్.ఎం అలపర్తి సత్యనారాయణ, స్టాఫ్ సెక్రటరి గాజుల లక్ష్మీప్రసాద్, దాత పూర్ణచంద్రరావు, పద్యాల రఘురామ్ పాల్గొన్నారు.

జగన్నాథ రథయాత్ర ప్రారంభం

మచిలీపట్నంటౌన్: స్థానిక జగన్నాథపురంలో 200 సంవత్సరాల క్రితం ఏర్పడిన సుభద్ర బలరామ సమేత జగన్నాథ స్వామి దేవాలయం నుంచి శుక్రవారం రాత్రి 'జగన్నాథ రథయాత్ర' ప్రారంభమైంది. పూరీ జగన్నాథ పాదయాత్ర ఆచారం ప్రకారం ఏర్పాటు చేసిన ఈ రథయాత్రలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తరించారు. దేవాలయ అర్చకులు బృందావనం సుధీర్ ఆచార్యులు, దేవస్థానం మేనేజర్ గోవాడ కృష్ణారావు, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, మాదిరెడ్డి అంజిబాబు, లంకిశెట్టి సాయిబాబు, మాదిరెడ్డి సత్యసాయి శ్రీనివాస్, గుప్త కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు రెడ్‌క్రాస్ సాయం


బాధితులకు సాయం అందిస్తున్న తహసీల్దార్ విజయ ప్రసాద్ సర్పంచి శాంత కుమారి,

దాలిపర్రు(ఘంటసాల): ఆపదలో ఉన్న నిరుపేదలకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ అన్నారు. మండలంలోని దాలిపర్రు ఎస్సీ కాలనీకి చెందిన తూము ప్రసాద్- బేబీషాలిని దంపతులకు చెందిన తాటాకు ఇల్లు గత బుధవారం కురిసిన వర్షానికి, గాలులకు కుప్పకూలిపోయింది. దీంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కృష్ణా జిల్లా శాఖ సహకారంతో బాధితులకు వంట సామగ్రి, టార్పాలిన్ అందించారు. తహసీల్దార్ విజయ ప్రసాద్ సహకారంతో బియ్యం, సరుకులను సర్పంచ్ డోకిపర్తి శాంత కుమారి, తహసీల్దార్ విజయ ప్రసాద్ చేతుల మీదగా శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి పిచ్చేశ్వరరావు, కె.సాల్మన్ రాజు, వీఆర్వో వీర్ల నాగేశ్వరరావు, వీఆర్ఏలు ఎం.సుబ్బారావు, సీహెచ్.పిచ్చేశ్వరరావు, డీలర్ వి.వెంకటేశ్వరరావు, డోకిపర్తి రాజేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

'పది'లో ప్రతిభ చూపిన బాలికలకు సన్మానం


సన్మానం అందుకున్న బాలికలతో అతిథులు, గ్రామ ప్రముఖులు

తలగడదీవి(నాగాయలంక): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచిన భోగాది గాయత్రి శ్రీసహస్ర, ట్రిపుల్ ఐటీలో సీటు పొందిన బాలికలు మండలి పవిత్ర, పులిగడ్డ అలేఖ్యలకు బడి ఆవరణలో శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. హెచ్‌ఎం బండ్రెడ్డి శివరామ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాఠశాల, గ్రామం తరపున ముగ్గురు బాలికలను ఎమ్మెల్యే తనయుడు మండలి రాజా, స్కూలు అభివృద్ధి కమిటీ చైర్మన్ వర్రే రాంబాబు ఘనంగా సన్మానించారు. పలువురు మాట్లాడుతూ ఉత్తమ విద్యతోనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చంటూ విద్యార్థులను అభినందించారు. పాఠశాల విద్యార్థుల అవసరాల నిమిత్తం రూ.25 విలువైన ప్లేట్లు, గ్లాసులు త్వరలో అందిస్తానని యూత్ లీడర్ బండ్రెడ్డి హరి ప్రకటించారు. నియోజకవర్గ కాపునాడు అధ్యక్షుడు భోగాది సోమశేఖర్ (చిన్నారి), భోగాది శేషగిరి ఎస్ఎంసీ చైర్మన్ ఎ.మోహన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

అవనిగడ్డ సీఐ యువకుమార్

కోడూరు: విద్యార్థులు చెడు అలవాట్లు, చెడు స్నేహాలకు దూరంగా ఉంటే జీవితం ఉన్నతంగా ఉంటుందని అవనిగడ్డ సీఐ యువకుమార్ అన్నారు. శుక్రవారం స్వతంత్రపురం జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం చాలా మంది విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిసలుగా మారి చదువుపై దృష్టి పెట్టడం లేదని, తల్లిదండ్రులు ఈ విషయంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సీఐ చెప్పారు. సెల్‌ఫోన్లను మంచికి వినియోగించి లోకజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. మైనర్లు ద్విచక్రవాహనాలు నడపం చట్టరీత్యా నేరమని, వాహనాలు నడిపే మైనర్లతో పాటు తల్లిదండ్రులపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలికలు గుడ్ టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని, అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ట్రాఫిక్స్ రూల్స్‌తో పాటు పోక్సో చట్టాల గురించి వివరించారు. డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. ఎస్ఐ చాణిక్య, హెచ్‌ఎం మెండు ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించాలి

కోనేరుసెంటర్: గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డుల సమస్యలను వెంటనే పరిష్కరించి, కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి బూర సుబ్రహ్మణ్యం శుక్రవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బందరు మండలం రుద్రవరంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాల, పాఠశాలల్లో ప్రేమ్ సెక్యూరిటీ ఏజెన్సీ ద్వారా పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గురుకుల సెక్యూరిటీ గార్స్ నిరాహారదీక్ష చేపట్టారు. వీరికి సీఐటీయూ నాయకులు మద్దతు తెలుపుతూ దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గురుకులంలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్స్ గత ఆరేళ్ళుగా ఏజెన్సీ ద్వారా పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే వేతనం సిబ్బందికి అందని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈపీఎఫ్, ఈఎస్ఐకి సంబంధించింది కూడా యాజమాన్యం వాటా కార్మికుల ద్వారా కట్టించటం జరుగుతుందన్నారు. యాజమాన్యం అవలంభిస్తున్న తీరు సరైనది కాదన్నారు. ఏజెన్సీని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిబ్బందికి తక్షణమే వేతనాలు పెంచాలని, విధుల్లో ఉన్న వారికి భద్రతా సౌకర్యాలు, వారాంతపు సెలవులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే నిరాహారదీక్షని కొనసాగిస్తామని ఉద్యోగుల సంఘం నాయకులుతెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ జయరావు, సెక్యూరిటీ గార్డ్స్ ఉద్యోగుల సంఘం నాయకులు బి. రవికుమార్, టి.అరుణ్ కుమార్, డీ మురళి, పి.సుబ్బయ్య, డి.సుబ్రమణ్యం కే రాజు, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు త్వరగా ఇవ్వండి

ఏపీసీపీడీసీఎల్ చైర్మన్, ఎండీ పుల్లారెడ్డి


అధికారులతో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ చైర్మన్, ఎండీ పుల్లారెడ్డి

మచిలీపట్నంటౌన్: వ్యవసాయ విద్యుత్ నూతన కనెక్షన్‌లను త్వరితగతిన ఇచ్చి రైతాంగానికి ఇబ్బంది లేకుండా చూడాలని ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జి.పుల్లారెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక కృష్ణా సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ కార్యాలయంలో శుక్రవారం పలు అంశాలపై ఆయన విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆ సంస్థ డైరెక్టర్ (టెక్నికల్) ఎ. మురళికృష్ణతో కలిసి ఆయన ఈ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంజినీరింగ్ అధికారులకు పలు అంశాలపై సూచనలు ఇచ్చారు. అగ్రికల్చర్ సర్వీస్ పనులు త్వరతగతిన పూర్తి చేసి రిలీజ్ చేయవలసిందిగా ఆదేశించారు. లో వోల్టేజ్ సమస్యను నివారించేందుకు ప్రతిపాదనలు పంపి కొత్త లైన్లు పూర్తి చేయాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని విస్తృతంగా ప్రచారం చేసి ఎక్కువ సర్వీస్‌లను సోలార్ కనెక్షన్‌లుగా మార్చాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో కృష్ణ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.సత్యానందం, సర్కిల్లోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

మూసివేసిన క్వారీల్లో ఇసుక తరలిస్తే చర్యలు

తహసీల్దార్ విజయ ప్రసాద్

ఘంటసాల: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని శ్రీకాకుళం, పాపవినాశనం ఇసుక క్వారీలను అక్టోబర్ 15వ తేదీ వరకు మూసివేస్తున్నట్లు తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు శ్రీకాకుళం పరిధిలోని ఇసుక క్వారీలను నిర్వహించగా, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాల మేరకు ఈ నెల 1వ తేదీ నుంచే ఈ నిషేధం అమలులో ఉందన్నారు. ఆయా ఇసుక క్వారీల్లో ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారా అక్రమంగా ఇసుక తరలించే వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. శ్రీకాకుళం, పాపవినాశనం ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు గృహ నిర్మాణాలు, ఇతర అవసరాల నిమిత్తం కూలీల ద్వారా ఇసుకను ఎడ్లబండ్ల ద్వారా రవాణ చేసుకోవడానికి అనుమతి ఇప్పించాలని కోరిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇసుక తరలించకుండా గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఆయన కోరారు.